# మహత్తు

మొక్కపాటి నరసింహశాస్త్రి గారు [సాహి

౧

రాజోలుతాలూకాలో దొడ్డవర మనే చిన్న గ్రామము ఒకటి ఉన్నది. చూపుమేరవరకు ఎటుచూచినా కొబ్బరి తోటలు, మామిడితోటలు, పంపనపనస తోటలు, పనసతోటలు కలిగి ఎక్కడా సూర్యరశ్మి లోపలికి చొరకుండా చల్లగా ఉంటుంది. ఆ తోటలమధ్య ఋషివాటికలవలె దూరదూరముగా చిన్నచిన్న ఇళ్లు. అవి చాలవరకు పాశ్చాత్యనాగరికతాసంపర్కము లేని బ్రాహ్మణగృహములు. అందరూ పూర్వాచారపరాయణులు, వేదాధ్యయనసంపన్నులు; ఆంగ్లవిద్యావిముఖులు; సంపన్నగృహస్థులు. ఉదయాన్నే లేచి కాలకృత్యములు తీర్చుకుని, సమీపముననున్న గోదావరిలో స్నానసంధ్యాద్యనుష్ఠానములు తీర్చుకుని, ఇంటికి వచ్చి విభూతిపిండికట్లు ధరించి, నీరుకావిధోవతులు ఒళ్లిపింజలుపెట్టి కట్టుకుని, వీథిఅరుగు మీద కూచుని, పాఠము నూరుకుంటూనో, జందెములు వడుక్కుంటూనో శిష్యులకు పాఠములు చెప్పుతూఉంటే, మనము ఇరువదవ శతాబ్దములో ఉన్నసంగతి మరచిపోతాము. ఋషులకాలము జ్ఞాపకమువస్తుంది. ప్రపంచకము సంగతంతా ఎలాఉన్నా ఇక్కడ మట్టుకు కాలచక్రము కొన్ని శతాబ్దముల నుంచి తిరగడము మానివేసి తుప్పపట్టినట్లు కనుపిసుంది.

ఆవూళ్లో మాకు దగ్గర బంధువులున్నారు. వాళ్లు చాలారోజులనుంచి ఒక్కసారి వాళ్లఊరువచ్చి పదిరోజులుండి వెళ్లమని బలవంత పెడుతున్నారు. ఒక్కసారి వెళ్లి చూచి వద్దామని బుద్ధిపుట్టింది. అదికాకుండా వేసవికాలములో మావూళ్లో ఎండలు చాలా తీవ్రముగా ఉంటాయి. వైశాఖమాసము వచ్చింది. ఎండలు భరించడానికి శక్యముకాకుండా ఉన్నాయి. పగలు నిప్పులు కురుస్తున్నాయి. రాత్రి రెండుజాములవరకు వడగాలి కొడుతోంది. ఇటువంటి సమయములో ఒక్కసారి దొడ్డవరము వెళ్లి పది పదిహేనురోజులక్కడ ఉంటే ఈవేసగి బాధా తగ్గుతుంది, మనవాళ్లను చూచినట్లూ ఉంటుందని, వైశాఖ శుద్ధ దశమినాడుబయలుదేరి దొడ్డవరమువచ్చాను.

కొంచెమించుమించుగా, నరకమునుంచి స్వర్గములోకి వచ్చినట్లుగా ఉంది. ఎండన్న మాట తెలియడము లేదు. మావాళ్లింటికి నూరుగజములలో వైనతేయమనే గోదావరి పాయ, ఒకటి ప్రవహిస్తూ ఉంటుంది. ఎప్పుడూ దానిపైనుంచివచ్చే చల్లనిగాలి, దాహ

మైనప్పుడు, తియ్యని అమృతమువంటి కొబ్బరి బొండములలో నీళ్లు, మధ్యాహ్నము ఫలాహారములు. ఇంక కావలసిన దేమిటి? కేవలమూ ఇంద్రభోగము అనుభవిస్తున్నాను. సాయంకాలము గోదావరీతీరాన్ని కూచుని, పడవవాళ్ల పాటలువింటూ, చల్లనిగాలి అనుభవిస్తూ, నీటిలో చేపల్ని చూస్తూ, చెట్లపైన పక్షులగానమువింటూ ప్రపంచమును మరచి పోతూ ఉండేవాడిని.

దొడ్డవరమువచ్చి ఆరుదినము లయింది. ఇక్కడ ఎంతసౌఖ్యముగా ఉన్నా పట్నవాసపు సందడి, క్లబ్బు, టెన్నిసు, పేపర్లూ లేకపోవడము మూలాన్ని రోజులు జరగడము చాలాకష్టంగా ఉంది. లేవడము, స్నానము చేసి భోజనము చెయ్యడము, నిద్రపోవడము, ఫలహారము చెయ్యడము, షికారు వెళ్లివచ్చి మళ్లీభోజనముచెయ్యడము, నిద్రపోవడము; ఇట్లా ఎన్నాళ్లో గడపగలము. ఎంతైనా సరే మళ్లీ మాపూరుచేరుదామని బుద్ధి పుట్టింది.

ఆరోజుసాయంకాలము యథాప్రకారముగా గోదావరీతీరానికి షికారు వెళ్లాను. సుమారు ఆరుగంట లవుతుంది. రేవుదగ్గరగా కూచుని ఏరుదాటడానికి వచ్చేవాళ్లను, పైనుంచివచ్చి దిగిపోయేవాళ్లను చూస్తూ కూచున్నాను.

నేనూ కూర్చున్న పది నిముషములకు సుమారు నలుబదియైదు సంవత్సరములు వయసుగల బ్రాహ్మణుడొకాయనవచ్చాడు. ఆయనను నేనదివర కెప్పుడూ చూడలేదు. ఆగ్రామస్థుడో కాదో కూడా నాకుతెలియదు. ఎవరో రేవుదాటడానికి వచ్చారనుకున్నాను. కాని ఆయన పడవకు వెళ్లలేదు. ఒక్కసారి నావైపు నిదానముగా చూచి నాపక్కను కూచున్నాడు. మనిషి కొంచెము పొడగరి. ఆయెత్తుకి తగ్గలావు. తేజోవంతములు, విశాలములైన కళ్లు. చక్కని నుదురు. తీర్చిన ముక్కు. నిమ్మపండువంటి శరీరచ్ఛాయ. కొంచెము నెరుపుజూపిన తల. ఒకవింతయైన "శాంతరసమొల్కు బ్రహ్మతేజము." ఆమనిషిని చూడడముతోనే ప్రతివాళ్లకు ఒక విధమైన భయభక్తులు కలుగుతాయి.

నేను ఇంగ్లీషు చదువుకున్నవాడి నవుటచేత ఆయన నాపక్కను కూచున్నా నేను ఆయనను పలుకరించలేదు. ఒకక్షణము ఊరుకుని ఆయనే నన్ను పలుకరించాడు. మాపూరు పేరు మాఇంటిపేరు మొదలైనవన్ని అడిగాడు. ఇంకా ఏవో ఈసంగతులూ ఆసంగతులూ మాట్లాడుతూ కూచున్నాము.

ప్రదోషకాలము సమీపిస్తున్నది. ఆయనా సంధ్యావందనమునకు లేవవలె ననుకుంటున్నాడు. ఇంతట్లోకే ఎక్కడనుంచో ఒక సన్న్యాసిఒకాయన వచ్చాడు. మావెనుకనుంచిరావడముచేత ఆయన మా ఎదుటకి వచ్చేవరకూ మేముచూడలేదు. మాకు కనపడగానే నాపక్కనున్న బ్రాహ్మణుడు లేచి స్వాములవారికి సాష్టాంగనమస్కారముచేసి ఒకటి రెండు దినములు అక్కడ ఉండి తనగృహమును పావనముచేసి తన్ని ధన్యుడిని కావించ-

మని, కృతాంజలియై సవినయముగా ప్రార్థించాడు. స్వాములవారు ఉండుటకు వీలుపడదనీ, అమలాపురము వెడుతున్నామనీ, ఈసారి




పక్కనున్న బ్రాహ్మణుడు లేచి.........సవినయముగా ప్రార్థించాడు.

మళ్లీ ఆమార్గమున వచ్చినపుడు అక్కడ భిక్ష చేస్తామనీ చెప్పి వారికి నారాయణస్మరణతో శలవిచ్చి రేవుదాటి వెళ్లిపోయారు.

ఇదంతా నాకు ఆశ్చర్యముగా ఉంది. ఎవరో సన్న్యాసి కనబడ్డంత మాత్రాన్ని ఈయన ఆయనకు సాష్టాంగపడి తనింటికి రమ్మని అంతప్రాధేయపడడ మెందుకా అనుకున్నాను. సన్న్యాసి అయినంతమాత్రాన వచ్చిన విశేషమేమి టనుకున్నాను. నేను మట్టుకు లేచి స్వాములవారికి నమస్కారము పెట్టలేదు.

స్వాములవారు వెళ్లగానే శాస్త్రిలుగారు నెమ్మదిగా నాదగ్గర కొచ్చారు. సూర్యాస్తమయము అయినది. పశ్చిమదిక్కున ఆకాశము రక్తవర్ణముదాల్చింది. గోదావరీజలము తప్తలోహమువలె మెరుస్తూఉంది. ఆధునిక యువకుల హృదయములవలెనే గోదావరి సుక్కిపోయి నెమ్మదిగా సముద్రము వైపు వెడుతూఉంది. మందమారుతం అజ్ఞాతమైన విదేశవార్తలనేవో మా చెవిలో ఊదుతూఉంది.

నాప్రక్కనున్న బ్రాహ్మణుడు నన్ను సంబోధించి "సన్న్యాసాశ్రమమంటే మీబోటి వాళ్లకు గౌరవములేదు కాబోలు" నన్నాడు. "గౌరవములేక నేమిలెండి ప్రతివాళ్లూ సన్న్యాసివేషం వేసికొని తిరిగే ఈరోజులలో ఎవరు అసలైన సన్న్యాసులో తెలిసికోవడం కష్టం. అంతేకాకుండా నిజంగా చూడవస్తే సరియైన సన్న్యాసులు ఈకాలములో లేరేమోనని కూడానా అనుమానం అన్నాను నిర్లక్ష్యంగాను. "అబ్బాయి! నీవు తొందరపడి ఆలాగ అనకు. హిందూమతము ఉన్నంతకాలము భారతదేశము ఉన్నంతకాలము మహానుభావులు ఉండే తీరుతారు. అటువంటివాళ్లు ఏసకృతుగానేనా ఉండబట్టే ప్రపంచము ఈమాత్రముగానేనా

ఉంది. నాస్వానుభవములో ఒకసంగతి చెప్తాను విను" అన్నాడు.

౨

ఆకాశమున ఎరుపు కాస్తతగ్గి కొంత నలుపుతో మిశ్రమమయి ఉంది. గాలికూడా ఇందాకటికంటె గట్టిగా వీస్తూఉంది. తూర్పు దిక్కున నిండు చంద్రబింబము కొబ్బరితోటల చాటునుంచి తొంగిచూస్తూఉంది. ఆకాశము నిర్మలంగా ఉంది.

"మాది ఈప్రాంతములోనే ఒకగ్రామము. మాతండ్రి చతుశ్శాస్త్రపండితుడు, సదాచార సంపన్నుడు, భూతదయగలవాడు, అందరి చేతనూ చాలా గౌరవింపబడేవాడు. ఇంట్లో ఎప్పుడూ పదిమందికి తక్కువగాకుండా శిష్యు లుండేవారు. చాలామితిపరుడు. అందుచేత ఒక్కరి నాశ్రయించవలసిన అవసరము లేకుండా కాలక్షేపము చేయడానికి వీలుగా ఉండేది. నిత్యమూ గోదావరీస్నానము చేస్తూ, శిష్యులకు పాఠములు చెప్పుకుంటూ, వచ్చిన అతిథులకు సత్కారముచేస్తూ, చాలా నిష్ఠగా ఉండేవాడు.

ఆయనకు లేకలేక చిరకాలమునకు నేను పుట్టాను. ఆయనతపస్సు ఫలించి వంశము నిలిచినదని చాలా సంతోషించాడు. కొడుకులు కల్గగానే సంతోషించడము లేకపోతే విచారించడమేకాని వాళ్లవలన ఎంతసుఖం కలుగుతుందో ఎంతకష్టము కలుగుతుందో ఆలోచించేవాళ్లు ఎవ్వరూలేరు. అతిగారాబంగా మా తలిదండ్రులచేతులలో నానాటికి పెరిగి పెద్దవాడనయ్యాను.

మాతండ్రిగారే నాకు విద్యాగురువులు. పండ్రెండు సంవత్సరములు వచ్చునరికే కొంత కావ్యజ్ఞానముకలిగినది. ఎప్పటికైనా నా తనంతటివాడిని అవుతానని మాతండ్రి సంతోషించాడు. కాని మా అమ్మకుమట్టుకు నాకు ఇంగ్లీషు చెప్పించవలెనని ఉండేది. మాబంధువుల పిల్లలని ఇంగ్లీషు చదువుకునే వాళ్లను కొంతమందిని చూసినప్పటినుండీ నాకూ ఇంగ్లీషుచదువవలెనని బుద్ధిపుట్టింది. మాతండ్రికి ఇష్టములేకపోయినా మాతల్లిమాటా నామాటా తీసివేయలేక నన్ను అమలాపురము తీసుకువెళ్లి అక్కడ ఒకబంధువుల ఇంట ప్రవేశపెట్టి ఇంగ్లీషు చదువు చెప్పించమని వారికి వొప్పజెప్పి వెళ్లాడు. సంస్కృతమువలెనే ఇంగ్లీషుకూడా త్వరగానే వచ్చేది. నాల్గోఫారము వరకూ వచ్చాను.

ఇక్కడ యథేచ్ఛగా ఉండేవాడిని. నన్ను అడిగేవాళ్లూ చేసేవాళ్లూ లేరు. ఎప్పుడు ఎంత కావలెనంటె అంతడబ్బు మాతండ్రి నాకు పంపిస్తూ ఉండేవాడు. దానితో స్నేహితులు చాలామంది చేరారు. డబ్బు పుష్కలముగా నున్నప్పుడు స్నేహితులకు లోపమేమిటి? అందులోనూ నాదగ్గఱ పరిశీలనాశక్తి కొంత తక్కువ. అందుచేత అన్ని రకములవారూ చాల మంది నా చుట్టూ ఎప్పుడూ ఉండేవారు. పదిమంది చేరిన చోట నియమములూ కట్టుబాట్లూ తక్కువ గదా! మిత్రబృందం ఎక్కువైనకొద్దీ విద్యపై శ్రద్ధ తగ్గింది. పేకాటలు హెచ్చినవి. సిగరెట్లు కాల్చడము ఫేషననే ఉద్దేశముతో అభ్యాసము చేశాను. అక్కడనుంచి ఒకదానిలోనుంచి ఒకటి దుర్వ్యాపారములలోకి దిగాను.

ఇలాగుండగా నేనుండే ఇంటాయనకు పదహారుసంవత్సరముల వితంతుకూతురు ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయికి నాకూ ఎట్లాగునో సంబంధం కలిసింది. ఆ అమ్మాయికి సుమారు రెండు మూడువేల రూపాయాల వస్తువులు ఉన్నాయి. ఒకనాడు ఆ అమ్మాయిని వస్తువులసహా తీసికొని రాజమహేంద్రవరము చేరాను. సుమారు ఒక సంవత్సరముపాటు అద్వితీయమైన సుఖము అనుభవించాను.

ఇంటిదగ్గర ఆపిల్ల తలిదండ్రులూ నా తలితండ్రులూ మాకోసముపడ్డ పరితాపము, మమ్మలని వెతకడానికి చేసిన ప్రయత్నాలూ చెప్ప శక్యము కాదు. కాని మేముమాత్రము దొరకలేదు. దొంగసుఖములు ఎంతకాలము నిలుస్తవి. ఈశ్వరుడు మమ్మలనిచూసి సహించలేక పోయాడు. హఠాత్తుగా ఒకరోజురాత్రి ఆపిల్ల కలరావచ్చి తెల్లవారేసరికి కాలము చేసింది.

నేను అంతవరకూ కష్టము అన్నమాట ఎరగను. చావు ఎప్పుడూ చూడలేదు. నాకు ఉపద్రవమైన భయమువేసింది. మాతలిదండ్రులను పెట్టిన కష్టాలకు ఇది ఫలితము అనుకున్నాను. నాపాపఫలము ఇప్పుడే అనుభవిస్తున్నా ననుకున్నాను. ఆ అమ్మాయిని ఎట్లోదహనముచేయించి కొంచెము దుఃఖము చల్లారినతరువాత ఒకనాడు రాత్రి మాయిల్లు చేరుకుని క్షమించుమని మాతండ్రి పాదములపైని పడ్డాను. నాతండ్రి నన్ను ఇంట్లోకి రావద్దన్నాడు. ఎక్కడ నుంచి వచ్చానో అక్కడికే వెళ్లమన్నాడు. తులసితోటలో గంజాయి మొక్కవలె తమవంశము పాడుచేయడానికి పుట్టానన్నాడు. బ్రతికి ఉండగా ఎప్పుడూ తనకళ్ల పడవద్దన్నాడు.

ఆయన అన్నంతమాత్రాన్ని ఎక్కడకు పోను? ఆయనమాటలలో అసత్యము ఏమి ఉన్నది? ఆయన అన్నాడని నాకు కోపము వచ్చిన ప్రయోజనము ఏమున్నది? జరిగిన సంగతి అంతా చెప్పాను. ఇకముందు ఎప్పుడూ అటువంటిపని చెయ్యనని చెప్పాను. బుద్ధి వచ్చినదని చెంపలు వాయించుకున్నాను. కన్నకడుపు. పుత్రవియోగము ఎంతకాలము భరించగలడు? కొడుకు ఎంత దుర్మార్గుడైనా ఏకపుత్రవిషయమైనప్పుడు అంత్యకాలమున కాసినినీళ్లుపోయడానికి వాడేకదాదిక్కు. నాతండ్రి పెద్దవాడయ్యాడు. మళ్లీ ఎప్పుడూకళ్లకు కనపడడు అనుకొన్నకొడుకువచ్చి కాళ్లుపట్టుకొని ప్రాకులాడుతూ ఉన్నప్పుడు ఎలా పొమ్మనగలడూ. పోతే ఇంక తనకు దిక్కెవరు. ప్రపంచకములో ఎందరు దుర్మార్గులు లేరు. ఎంతమంది పశ్చాత్తాపమున బాగుపడలేదు. ఇక ముందు వీడుమాత్రము బాగుపడ కూడదా అనుకొన్నాడు. ఉండమనిగాని పొమ్మనిగాని ఏమీ చెప్పకుండా మాట్లాడకుండా మాతండ్రి లోపలకు చక్కాపోయాడు. తలుపుచాటున కళ్లనీళ్లు గుక్కుకుంటూ నిలబడ్డ మాతల్లి వచ్చి నన్ను కౌగలించుకుని బేరుమని రాగాలెట్టి లోపలికి తీసుకువెళ్లి తలంటి నీళ్లుపోసి భోజనము పెట్టింది.

## 3

అప్పటినుంచీ ఎక్కడికీ కదలకుండా పొలమూ బుట్రా చూసుకుంటూ ఇంటి దగ్గరనే ఉండేవాడిని. మా తండ్రి కళ్లపడడానికి



తలుపుచాటున కళ్లనీళ్లు గుక్కుకుంటూ నిలబడ్డ మాతల్లివచ్చి కౌగలించుకొని...తలంటి నీళ్లుపోసి భోజనముపెట్టింది.

ఎప్పుడూ భయముగాఉండేది. ఆయన ఎప్పుడు నాతోటి మాట్లాడేవాడు కాదు.

కొన్నాళ్లకు బ్రహ్మచారీ బెండకాయా ముదరకూడదని ఒకసంబంధంచూసి మావాళ్లు నాకు వివాహము చేశారు. నా పెళ్లికి మండపేటనుంచి ఒక భోగముమేళము వచ్చినది. భోగముమేళము చూడడముతోనే ఇంతకాలము నుంచీ బలవంతముగా అణచిపెట్టిన మనోభావాలన్నీ మళ్లీతలలెత్తినవి. పెళ్లి అయిదు రోజులూ అయ్యేసరికి నాసంకల్పములూ వాగ్దానములూ అన్నీ వెనకపడ్డాయి. మనుగుడుపులు కాగానే మండపేట చేరాను. చేతిలో డబ్బు పూర్తి అయ్యేవరకూ అక్కడ కాలక్షేపము చేశాను. అక్కడనుంచి నెమ్మదిగా రాజమహేంద్రవరము చేరాను. మళ్లీ ఇంటికి వెడితే నాతండ్రి గుమ్మము తొక్కనివ్వడని నాకు తెలుసును. ప్రాణముపోయినా మళ్లీ ఇంటికి వెళ్లకూడదనుకున్నాను.

రాజమహేంద్రవరములో వెనకటి అవస్థంతా ఒక్కసారి జ్ఞాపకమువచ్చి అక్కడ ఉండడము కష్టము అనిపించింది. అక్కడనుంచి కాకినాడ వచ్చాను. చేతిలో ఒక్క దమ్మిడీ లేదు. అప్పటికి భోజనముచేసి రెండు రోజు లయినది. ఏమిచేయడానికీ తోచలేదు. ఎప్పుడూ ఎవ్వరినీ దేహి అని చేయిచాచి అడిగినవాడిని కాను. సత్రములోనికివెళ్లి భోజనము పెట్టమని అడగడానికి కూడా సిగ్గుగా తోచింది. ఒక షావుకారు నాశ్రయించి

నేను దిక్కులేనివాడనని చెప్పి ఆతనివద్ద ఒక గుమాస్తాగా ప్రవేశించాను.

ఇట్లా కొంతకాలము గడిచింది. సాహుకారు కొడుకునకూ నాకూ చాలా స్నేహము కలిసినది. అతడూ కొంత దుర్నడత కలవాడని త్వరలోనే తెలిసికొన్నాను. మేమిద్దరమూ కలిసి తిరగడము ఆరంభించాము. ఆకుర్రవాడు పిఠాపురములో ఒకదాసీ మనిషితో స్నేహము చేశాడు. ఆతనితోపాటు నేనూ తీరిక ఉన్నప్పుడు పిఠాపురము వెడుతూ వస్తూవుండేవాడిని. కొన్నాళ్లకీసంగతి సాహుకారికి తెలిసి నన్ను ఉద్యోగములో నుంచి తొలగించాడు.

సాహుకారు కొడుకు నాకు రహస్యముగా కొంతడబ్బు ఇచ్చి నన్ను పిఠాపురములో ఉండమని చెప్పాడు. నేను పిఠాపురములో ప్రవేశించాను. కొంతకాలము జరిగేసరికి నాజీవితము అంతా అసహ్యంగా తోచింది. తలిదండ్రులపైన దృష్టిపోయింది. కాని ఇంటికి పోవడానికి భయముగా ఉంది. ఏ మొఖము పెట్టుకుని మళ్లీ యింటికి వెళ్లడము. ఏలాగు తండ్రిఎదట నిలబడడము. ఆయనతోటి ఏమని చెప్పడము. ఏమిచెప్పతేమాత్రము ఆయన ఏమని నమ్ముతాడు. లేకలేక పుట్టినందుకు వారి కళ్లయెదుట ఉండి వారికి సేవచేయడానికి బదులు ఇలా అయిపోయాను కాదా అని అట్టే దుఃఖంవచ్చింది. పాదగయలోపడి కుక్కుటేశ్వరస్వామి పాదసన్నిధిని ప్రాణములు విడుద్దా మనుకున్నాను. కాని అందుకూ ధైర్యము లేకపోయింది.

ఆలాగే సాయంత్రమువరకూ కాలక్షేపముచేసి ఏమీ ఆలోచక సాయంకాలము అలవాటు చొప్పున నాదాసీ ఇంటికి బయలుదేరాను. తోవలో కొన్ని మామిడిపళ్లూ మిఠాయి కొనుక్కొని వెడుతూ ఉన్నాను. దారిలో కోటగుమ్మముదగ్గర రావిచెట్టు ఒకటి ఉన్నది. ఆరావిచెట్టుక్రిందను ఒక సన్యాసి దర్భాసనము వేసుకుని కూర్చున్నాడు. చుట్టూ కొందరు బ్రాహ్మణులు కూర్చున్నారు. తదితరులు కొంచెము దూరములో నిలబడ్డారు.

అంతా నిశ్శబ్దముగా ఉంది. ఆయన ధ్యానములో ఉన్నారు. కళ్లు తెరిచేవరకూ వీరందరూ కనిపెట్టుకుని కూర్చున్నారు. నేనూ వెళ్లి ఆయనను చూడడముతోటే మనసులో ఒకవిధమైన ఆందోళన బయలు దేరింది. నేను ఎక్కడికి వెళ్లవలె ననుకున్నదీ మరచిపోయాను. హృదయంలో ఒకవిధమైన భక్తి బయలుదేరింది. ఆలాగే నిశ్చలుడనై ఆయనకేసి చూస్తూ నిలబడ్డాను.

కొంతసేపటికి ఆయన కళ్లు తెరిచారు. తెరవగానే నాకేసి చూశారు. నాకు ఒళ్లు తెలియలేదు. చేతిలో పళ్లూ పొట్లము ఉన్న సంగతి మరచిపోయాను. వాటిని క్రింద జారవిడిచి నమస్కరించాను. ఆయన మందహాసముతో "నారాయణా!" అన్నారు. కూర్చోమని సంజ్ఞ చేశారు. కిందనున్న పళ్లూ పొట్లము తీసికొన్ని అక్కడనే కూర్చున్నారు. అక్కడ ఉన్నబ్రాహ్మణులు స్వాములవారిని తమఇంటికి రమ్మని ప్రార్థించారు. స్వాములవారు రామన్నారు. క్రమేణా అందరూ శెలవు తీసికొని

వెళ్లిపోయారు. నాకుమట్టుకు కదల బుద్ధి అయ్యిందికాదు.




చేతిలో పళ్లపొట్లము............ ......జారవిడిచి నమస్కరించాను.

స్వాములవారు నన్ను ఉద్దేశించి 'ఎక్కడికి వెడుతూ ఉన్నావు' అన్నారు. ఏమి చెప్పడానికీ తోచిందికాదు. కాని చేసినపాపము చెప్పితే పోతుందని నాసంగతి అంతా ఒక్కసారి వారితోటి చెప్పాను. నేను చెప్పినదంతా విని ఆయన నవ్వారు. నవ్వేటప్పటికి నాకు కొంచెము కోపము వచ్చింది. అయినా యీ యనతోటి చెప్పవలసిన అగత్యంయేమివచ్చింది అనుకున్నాను. నాపళ్లపొట్లం పట్టుకుని నేను లేచాను.

"ఏం, వెడుతూ ఉన్నావా" అన్నారు స్వాములవారు గంభీరంగా. "చిత్తం శెలవు ఇప్పిస్తే వెడతా"నన్నాను. "మాకు ఫలహారానికి ఆపళ్లు ఇచ్చి వెళ్లవలసింది" అన్నారు. కొంచెము సందేహించాను. దగ్గిర, డబ్బా లేదు. దేవికి ఫలములైనా అర్పించకపోతే ఆగ్రహము వస్తుందేమో. స్వాములవారికి నా అంతట నేను ఇవ్వకపోవడము సరిగదా, ఆయన అడిగినప్పుడైనా ఇవ్వకపోతే ఈయన కేమి కోపము వస్తుందో. అయినా ఈయనకు కోపము వచ్చిమట్టుకు నన్నేమిచేస్తారు. నవ్వుతూ "మీకిస్తే నాకేమి ప్రయోజనము" అన్నాను. "ఇచ్చిచూడు తెలుస్తుంది" అన్నారు. "ఏమి తెలుస్తుంది" అన్నాను. "ఐనా నీవు ఇచ్చి ఈరాత్రి ఇక్కడ ఉండిచూడు. నీకు ఇష్టము లేకపోతే మళ్లీ నీపళ్లు నీకు ఇస్తా" నన్నారు. సన్యాసి మాటలవల్ల నాకు కొంత ఆశ్చర్యము కలిగింది. ఉండమని లోపలనుండి ఏదో చెప్తూఉన్నట్టు వినబడింది. వెళ్లిపోదామంటే కాలు ముందుకు సాగడము లేదు. అయినా ఈచిత్రము ఏమిటో చూద్దామని పళ్లపొట్లము ఆయనకు ఇచ్చి ఒక్క నమస్కారము చేసి అక్కడనే కూర్చున్నాను.

అక్కడకూర్చున్న కొంత సేపటికి కళ్ళకు మైకము కమ్మినట్టు అయింది. ఆపైన నాకు ఒళ్ళుతెలియలేదు. నిద్రలో ఈలోకము విడిచి పెట్టి దివ్యలోకమునకు ఎక్కడకో వెళ్ళినట్టు



రత్నఖచితమైన తూగుటుయ్యాలలో కూర్చుని దేదీప్యమానమైన.........మహేంద్రభోగము అనుభవించాను.

కలవచ్చినది. అక్కడ బాగాలు మేడలలో రత్నఖచితమైన తూగుటుయ్యాలలో కూర్చుని దేదీప్యమానమైన నక్షత్ర కాంతులలో అప్సరఃస్త్రీలనృత్యము చూస్తూ గానము ఆలకిస్తూ మహేంద్రభోగము అనుభవించాను.

కళ్ళు తెరిచేటప్పటికి సూర్యోదయము అయింది. నా ప్రక్కని స్వాములవారు లేరు. నేను రావిచెట్టు నానుకుని కూర్చున్నాను. ఎదట కోటగుమ్మము కనబడుతూ ఉంది. నేను అక్కడ అలా ఎందుకు కూర్చున్నానా అనుకున్నాను. రాత్రిసంగతి అంతా జ్ఞాపకము వచ్చింది. స్వాములవారు ఎక్కడకు వెళ్ళారు? రాత్రి సంగతంతా కలా,నిజమా?నిజము ఎట్లా అవుతుంది. ఈచెట్టుక్రింద కూర్చున్న వాడిని ఒక్కసారి దేవలోకములోకి ఎట్లా వెళ్ళి ఉంటాను. పోనీ కల అనుకోవడానికైనా గడచిన రాత్రియొక్క దివ్యపరిమళము కొంత శరీరానికి అంటుకొన్నట్టుగా ఉంది. శరీరమున కొత్త వింత తేజస్సుకూడా వచ్చినట్లున్నది. ఏమనుకోవడానికీ తోచలేదు. దారిని పోయే స్త్రీపురుషాదులను చూస్తే ఎప్పుడూలేని అసహ్యము కలిగింది. ఇదివరకు గడచిన జీవితమంతా హేయమనిపించింది. స్వాములవారు స్వర్గసౌఖ్యమును చవిజూపించారు. ఆస్వాములవారిని వెదకి వారిపాదసేవజేసి శాశ్వతమైన స్వర్గపదవి యిప్పించమని వారిని కోరవలెనని నిశ్చయము చేసికొన్నాను.

నేనుఉండే బసకు వెళ్ళి అక్కడనుంచి పాదగయకు స్నానానికి వెళ్ళాను. స్నానము చేసి దేవాలయములోకి వెళ్ళేటప్పటికి స్వాములవారు ఒకప్రక్కను కూర్చుని జపముచేసి

కొంటున్నారు. వారి జపము ముగిసేవరకూ అక్కడనే కూర్చుని వారు కళ్లు తెరవగానే సాష్టాంగ దండప్రణామము చేశాను. నారాయణస్మరణతో నన్ను దీవించి "ఏమి వచ్చావు" అన్నారు. "ఈ దుర్మార్గుణ్ణి తమ పాదసేవకునిగా తీసుకోమ్మ"ని ప్రార్థించాను. "నేను ఎప్పుడూ ఈపాల్లో ఉండను. ఈరోజునే వెళ్లిపోతూ ఉన్నాను" అన్నారు. "నేనూ మీ వెంటవస్తాను" అన్నాను. "నీవు పిఠాపురము విడిచిపెట్టి ఎట్లా వస్తావ"న్నారు. ఇదివరకు ఘోర పాపాలు, చేశాననీ అటువంటి జీవితముపైన విరక్తి పుట్టినదనీ వారి శిష్యునిగా నన్ను అంగీకరించి ముక్తిమార్గము చూపించవలసినదనీ చాలాసేపు ప్రార్థించాను. వారు మొట్టమొదట ఒప్పుకోలేదుగాని చివరకు ఎలాగైతే నేమి వారితో తీసుకువెళ్లడానికి ఒప్పుకున్నారు. ఆసాయంత్రమువరకూ అక్కడనే ఉన్నాము. రాత్రి దేవాలయములోనే పడుకున్నాము. ఒకరాత్రివేళ మహావాయుపథములో పక్షివలె ఎగిరిపోతూ ఉన్నట్లు తోచింది. కళ్లు తెరిచి చూదామంటె రెప్పలు ఊడిరాలేదు. కొంతసేపు అయ్యేసరికి ఉపద్రవమైన చలివేసింది. కళ్లు తెరిచాను. ఇంకా సూర్యోదయము కాలేదు. ఒకపర్వతశిఖరముపైన ఒకఋషివాటికలో మాస్వాములవారి పక్కనున్నాను నేను. చూపుమేరలో మనిషిసంచారముగాని జంతువులుగాని ఏమీ ఉన్నట్టు తోచలేదు. పక్షుల కలకలారావములు కూడా ఏమీ వినపడడములేదు. పర్వతప్రాంతమంతా మంచుపడి పిండి ఆరబోసినట్లు తెల్లగా ఉంది. అక్కడక్కడ చిన్నిచెట్లూ పొదలూ ఉన్నవి. నాపక్కనున్న స్వాములవారు ధ్యాననిమగ్నులై ఉన్నారు. అరుణోదయము అవుతూ ఉంది. ఒక్కరాత్రిలో పిఠాపురమునుంచి ఎంతోదూరాన్ని ఉన్న హిమవత్పర్వతాగ్రము పైన ఎట్లా వ్రాలానో తెలియలేదు. తెలియవలసిన అవసరములేదు. మహాత్ములకు ఏదిసాధ్యముకాదు? మాస్వాములవారికిని, అప్పుడే ఉదయిస్తూఉన్న ఈశ్వరస్వరూపమైన సూర్యభగవానుడికీ ఒక్కనమస్కారము చేశాను.

పాపాత్ముడను, స్త్రీలోలుడను, ఎప్పుడూ కలలోనైనా భగవన్నామస్మరణ చేయనివాడను, నాకిటువంటి మహాత్ముల సందర్శనము కలగడము వారిపాదసేవ చేసే భాగ్యము కలగడము ఏలావచ్చిందా అనుకున్నాను. నా పూర్వజన్మసుకృతము, నాతలిదండ్రులు మాపెద్దలు చేసిన తపఃఫలము, అయి ఉంటుందనుకున్నాను.

అట్లాగు స్వాములవారి పాదసేవచేస్తూ జ్ఞానదాయకము, ముక్తిదాయకమూ ఐనవిషయము లనేకములను వారివలన ఉపదేశము పొందుతూ, ఇల్లూ, వాకిలీ, సంసారమూ, ఒకటేమిటి సమస్తమూ మరచిపోయి అక్కడ అయిదుసంవత్సరములు ఒకక్షణమువలె గడిపాను. అనుక్షణమూ ఈశ్వరసన్నిధానమందున్నట్లె ఉండేది. చీనాంబరములూ హంసతూలికా తల్పములూ షడ్రసోపేతములగు విందులూ లేకపోయినా అక్కడ అనుభవించిన సౌఖ్యమూ ఆనందమూ ఈజన్మలో మరచిపోలేను. వేయి

జన్మములకైనా ఆఆనందముతప్ప వేరు నాకవసరములేదు.

సంతోషము ఎప్పుడూ నిత్యము కాదు. ఆత్మకెప్పుడూ శాశ్వతమైన శాంతి ఉండదు. పౌర్ణమి ఎప్పుడూ స్థిరముగా నిలవదు. స్వాములవారి పాదసన్నిధిని అట్టి నిరుపమాన ఆనందము అనుభవిస్తూ ఉండగా స్వాములవారు ఒక్కరోజున జపముచేసుకుని నాకేసి "నీకు తల్లీతండ్రీ ఉన్నారుకదా" అన్నారు. ప్రపంచము మరచిపోయా ననుకున్నవాడికి ఈసంగతి మళ్లీ ఎందుకు జ్ఞాపకముచేస్తూ ఉన్నారు. స్వామీ, అనుకుని "చిత్తం" అన్నాను "యుక్తవయస్కురాలైన భార్యకూడా ఉన్నదికదా" అన్నాడు 'చిత్తం' అన్నాను. "నాతో ఇదివరకు ఎందుకుచెప్పలే"దన్నారు. "తమకు తెలియనిదేమున్నది? వారెవ్వరియందూ నాకు ఇష్టములేక తమపాదసేవయందే కాలము పుచ్చుదామని వచ్చాను. ఇప్పటికైనా నాకు అది తప్ప వేరే ఏమీ అవసరములేదు" అన్నాను. "ఈఆశ్రమముసన్న్యాసులకుగాని గృహస్థులకు కాదు; నీవుఇంటికి వెళ్లిపో" అన్నారు స్వాములవారు. "స్వాములకెందుచేతనో ఈదీనుడిపైన ఆగ్రహము వచ్చినట్లున్నది." అన్నాను. "నాయనా! ఆగ్రహముకాదు. మీ యింటిదగ్గర నీతండ్రికి అవసానం సమీపించినది. ఆయన నీకై చాలా విచారిస్తూ ఉన్నాడు. నీమీద ప్రేమచేత ఆయన ప్రాణము పోలేకుండా ఉన్నది. నీభార్య నీకొరకై విలపిస్తూ ఉన్నది. అజ్ఞానురాలు అమాయకురాలూ ఐన ఆపిల్లను తీసుకువచ్చి నీకు కట్టి పెట్టి ఆ అమ్మాయి గొంతుక కోశానని మీతండ్రి చాలా విచారిస్తూ ఉన్నాడు. నీవువెళ్లి కుమారుడు తండ్రికి చేయవలసిన తుది కార్యము నిర్వహించి నీభార్యతో సుఖముగాకాపురము చేసికోవలసింది." అన్నాడు. "స్వామీ! నన్ను మళ్లీ సంసారములోకి తోయకండి. ఆపాశాలలో పట్టుబడితే మళ్లీ విడిపించుకు రాలేనేమో అని భయము వేస్తూఉంది. నాకు ఆశ్రమము ఇప్పించి ఇక్కడనే ఉండనివ్వవలసింది" అని చాలా దూరము బ్రతిమాలుకున్నాను. కానివారు నామాటవినక గృహస్థధర్మముయొక్క రహస్యం నాకు బోధించి, ఆధర్మము సరిగా నెరవేర్చలేనివాడు ఆశ్రమస్వీకారమున కర్హుడు కాడనిచెప్పి కొంతకాలము ఐనపిమ్మట వారు నాకు మళ్లీ దర్శనము ఇచ్చిఅప్పుడు ఆశ్రమము ఇస్తామనిచెప్పారు. "అయితే ఇంతదూరముపవిషంగా వెళ్లగలను. నాకు మార్గము తెలవివ్వ వలసింది" అని కన్నీరు విడుస్తూ కృతాంజలినై అడిగాను. వారునామీద చేయివేసి "నీకేమీ భయము లేదు. కొంతకాలానికి నేను తప్పక మళ్లీ వస్తాను. కళ్లు మూసుకో మీఇంటిదగ్గర దిగబెట్టి వేస్తా"నన్నారు. చిత్తంఅని కళ్లుమూసుకున్నాను.

౫

అయిదుసంవత్సరముల క్రితము ఇక్కడకు వచ్చిన నాటిరాత్రివలెనే వాయుపథములో ఎగిరిపోతూ ఉన్నట్లుగా తోచింది. కళ్లుతెరవవలె ననుకున్నా తెరవలేకపోయాను. కొంతసే పయ్యేసరికి నేల కాళ్లకు తగిలింది.

అక్కడనే నిలిచిపోయాను. కళ్లు మూతలు విడిపోయినవి. సూర్యుడస్తమిస్తూ ఉన్నాడు. పశువులు ఇంటికి చేరుకుంటూఉన్నవి. కలకలమని పక్షులుఆనాటి కబుర్లు చెప్పుకుంటూ గూళ్లకుచేరుకుంటూఉన్నవి. నేనూమాఊరుపొలిమేరను ఉన్నాను. నెమ్మదిగానేను మాఇంటివేపునడవసాగాను. ఇల్లుచేరేటప్పటికిమాఅమ్మ దీపారాధన చేస్తూ ఉంది. మానాన్న మంచముమీద కళ్లుమూసుకుపడుకున్నాడు. నాభార్య మంచముదగ్గరకూర్చుని సానపైనమందు అరగదీస్తూఉంది. నేను లోపల అడుగుపెట్టగానే నాభార్య తలఎత్తి చూచి అట్లే నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. కళ్లమ్మట నీళ్లు ప్రవాహముగా చెక్కిళ్లమీదనుంచి ప్రవహిస్తూఉన్నవి. మా తల్లిచేతిలో ఉన్న కిరసనాయిలు బుడ్డి క్రింద విడిచిపెట్టి కెవ్వుమని కేకవేసి నామీద పడి "నాయనా! నువ్వేనా!" అంది. ఆకేకవిని మాతండ్రి కళ్లుతెరచిచూసి "నాయనా! వచ్చావా, మధ్యాహ్నము కలలో స్వాములవారు ఒకరుకనపడి నిన్ను పంపిస్తామని చెప్పారు. ఎప్పుడువస్తావాఅనికనిపెట్టుకున్నాను", అన్నాడు. నేను వారికి నాచరిత్ర అంతా చెప్పి వారికి విచారమూ ఆశ్చర్యమూ, సంతోషమూ కలుగజేశాను నాకథ అంతా పూర్తిగావిన్న తరువాతను "నాయనా! నేనింక వెళ్లిపోతాను" అని ప్రాణాలు విడిచాడు.................

"అబ్బాయి! నాకథ ఇంక సమాప్తము కావస్తూఉంది. ఇంక చెప్పడానికి అట్టేలేదు. మాతండ్రిపోయి సంవత్సరము కాకముందే మాతల్లికూడా కాలముచేసింది. నేనూ అందరివలెనే సంసారభారమువహించి జీవయాత్ర గడుపుతూ ఉన్నా అందరివలెకాక కుమ్మరిపురుగువలె సంసారపంకిలములో పట్టుపడక దృష్టి ఈశ్వరునిమీదనే నిలిపిఉన్నాను అనడము అహంభావముకాదు. ఇద్దరు పిల్లలు పుట్టి పెద్దవాళ్లు అయ్యారు. స్వాములవారు ఇంకా ఎందుకురాలేదా అని అనుక్షణమూ వారిరాకకై ఎదురుచూస్తూ ఉన్నాను. నానాటికీ వారు వచ్చేరోజు సమీపిస్తూ ఉందని భావము కలుగుతూ ఉంది. కొన్నిరోజులలోనే మళ్లీ మాస్వామిసన్నిధిని చేరి శాశ్వతానందము పొందుతాను.

ఇదంతా నీతోటి తమాషాకు చెప్పాననుకోకు. మహాత్ములు లేరని మన దేశములో నశించారని తోసి వేయకు. నాస్తివాచకము పలకడము బహుసులభము. ఏవిషయములోనైనా హృదయములో విశ్వాసము లేనిదే జీవితము దుర్భరముగా ఉంటుంది. నీవు చిన్నవాడవు. భారతీయులకు సహజమైనటువంటి విశ్వాసము, మహాత్ములయెడల భక్తి పోగొట్టుకోవద్దు" అని నాప్రక్కనున్న బ్రాహ్మడు లేచి వెళ్లిపోయాడు.

చంద్రుడు అప్పటికి బాగా పైకివచ్చాడు. గోదావరికి పోటువచ్చి ఇందాకటికంటే బాగా నిండుగాఉంది. చంద్రకాంతిలో కోటిరత్నద్యుతితో ప్రకాశిస్తూఉంది. ప్రపంచమంతా నిశ్శబ్దంగా ఉంది. దూరమున ఒక పడవవాని పాట వినపడుతూఉంది. ఆబ్రాహ్మడు చెప్పినదంతా నాకు ఆశ్చర్యమూ సిగ్గూ కలిగించింది. ఆయన మాటలు వింటూ ఆయన

ముఖంకేసి చూస్తే ఆయన చెప్పినదానిలో అసత్యం ఏమాత్రమూ ఉన్నట్టు అనుమానము తోచలేదు. మన దేశముయొక్క మహత్తంతా నశించలేదుకదా అని సంతోషించాను. నీటిలో చూస్తూఉంటే హిందూదేశ చరిత్రఅంతా ఒక్కసారి పెద్దపటమువలె నాకళ్లముందు కనపడింది.

"ఏమిరా! ఇంకాఇంటికిరావు. నీకోసము అంతాకనిపెట్టుకున్నారు. ఎక్కడకు వెళ్లావో అనుకున్నాము" అని మామేనత్త కొడుకు వచ్చి నాబుజముమీద చరిచాడు. నేను ఉలిక్కిపడి లేచి ఇంటికి మళ్లాను. చంద్రబింబానికి మేఘము ఒకటి అడ్డువచ్చింది.

# ప్రకృతి

## ప్రణయిని

ఏల మధుమాసవాసరకాలములను, మరకతంబుల హాసియించు మురువు నించి,
పూవుమొగ్గల లేనవ్వు పొలుపుఁ దాల్చి, కవికుమారులహృదయంబుఁ గలఁచెదకట!

తే. కిసలయాంతరనిహ్నుత కుసుమకలిక, శ్రీయుషఃకాంతిచే వికసించి సౌర
భములు వెదచల్లురీతి నోప్రకృతి! నిన్నుఁ, గాంచి హృదయము నవరసోద్గారమగును.

చ. జలజలమంచు ముత్తెములు జారెడునట్లు పలుంగుగాల స
ల్లలితగతిఁ స్రవించు సలిలమ్ముల చల్లనినిస్వనమ్ము వీ
నులఁ దవులంగఁ బ్రేమపువినోదముగా భవదీయమర్మముల్
దెలియఁగఁ బల్కితంచుఁ బ్రకృతీ! వెతఁబోవనె నీదుమూర్తికై!

చ. జిలుగుఁబయ్యెద జాఱువాపసిఁడివో శృంగారపుందీప్తులో
తళుకుంబంగరుఁటేటితామరలవో ధమ్మిల్లపుష్పించులో
అలయింప న్నను నీవు పైఁబరచు ప్రేమాలోకనాలోకపు
న్విలసత్కాంతులో? యంచునెంతుఁ బ్రకృతీ! విద్యుల్లతారోచులన్.

తే. బహుముఖంబగు ప్రేమప్రభావ మెనగ, విశ్వమంతయు నీలోన వెలయుచుందు;
కరుణఁ బ్రేమరహస్యంపు సరణిఁదెలుప, ప్రకృతీ! నీలోన నైక్యమై పరగఁగలనో!

[జ్యోతిష్మతి]